క్లుప్తంగా

మామిడి పండ్లతో దుర్గమ్మకు అలంకరణ



గోకవరం దేవీచౌక్‌లో కనకదుర్గమ్మకు మామిడి పండ్లతో అలంకరణ

గోకవరం: ప్రసిద్ధి గాంచిన గోకవరం దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మకు శుక్రవారం 1,116 మామిడి పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఉదయం అమ్మవారిని మామిడి పండ్లతో అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై అన్నింటా విజయం చేకూర్చాలని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మామిడి పండ్లను వారికి ప్రసాదంగా పంపిణీ చేశారు.

ప్రత్యేక అలంకరణలో త్రిముఖలింగేశ్వరస్వామి



కొంకుదురులో ప్రత్యేక అలంకరణలో ఉన్న త్రిముఖలింగేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతల మామిడి వద్ద శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వర స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మాస శివరాత్రి సందర్భంగా గురువారం రాత్రి అభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి మల్లెల మాలలు, మామిడిపండ్లతో అర్చకులు రమణ శర్మ, శ్రీనివాస్ శర్మల ఆధ్వర్యంలో అలంకరణ చేశారు. ఆలయం కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి పర్యవేక్షణ చేశారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వరం



వడిశలేరులో సేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

రంగంపేట: ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రజలకు వరం అని, ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఎ.అనూష తెలిపారు. మేజర్ పంచాయతీ అయిన వడిశలేరు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడారు. జీవన శైలి విధానంలో చోటు చేసుకున్న మార్పులతో అత్యధికంగా రక్తపోటు సంక్రమిస్తోందని, ప్రతి ఒక్కరూ శరీర వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు. ఆకు కూరలు, కాయగూరలు ఆహారంలో ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. సుమారు 100 మందికి వైద్య సేవలు అందించారు. పీహెచ్‌ఎస్ ఎల్.గంగాభవానీ, ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



సీతానగరం గ్రంథాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు జి.శేఖర్, పీడీ ఎస్ఎస్‌బీటీ సుబ్రహ్మణ్యం, గణిత ఉపాధ్యాయులు కన్నూరి సతీష్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొని సరస్వతీ నమస్తుభ్యమ్ గేయాన్ని విద్యార్థులతో ఆలపించారు. పుస్తకం పఠనం చేయించారు. హాజరైన 35 మంది విద్యార్థులకు బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు.

అతి వేగమే ప్రమాదానికి కారణం

మధురపూడి: అతి వేగంగా ద్విచక్ర వాహనాన్ని నడపడం వల్లే గురువారం రాత్రి కోరుకొండ మండలం జంబూపట్నం క్రాస్ రోడ్డు సమీపంలోని రోమ్ సిటీ వద్ద రోడ్డు ప్రమాదం జరిగిందని కోరుకొండ ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోరుకొండ నుంచి కొంతమూరు వైపు స్నేహితులతో కలిసి వెళుతున్న అరుగుల ప్రసాద్ వేగంగా, నిర్లక్ష్యంగా, హారన్ కొట్టకుండా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ఎదురుగా స్కూటీపై వస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన పూర్ణిమను ఢీకొట్టాడన్నారు. దీనితో పూర్ణిమ, ఆమె స్నేహితుడు కింద పడ్డారని, ఈ ప్రమాదంలో అరుగుల ప్రసాద్‌కు, పూర్ణిమకు బలమైన గాయాలయ్యాయన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పూర్ణిమ మృతి చెందింది. మృతిరాలి తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశుపోషణలో
మెళకువ ముఖ్యం

- వడదెబ్బతో పాల దిగుబడిపై ప్రభావం
- అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో 80,667 గేదెలు, 32,960 ఆవులు



ఆరుబయట ఉన్న పశువులు

పెదపూడి: పెరుగుతున్న వేసవి ఎండలు, వడగాడ్పుల నేపథ్యంలో పశువుల సంరక్షణపై పాడి రైతులు అవసరమైన జాగ్రత్తలు తక్షణం చేపట్టాలి. లేకుంటే పశువులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఒక పక్క తీవ్రమైన ఎండలు, మరోపక్క ఉక్కపోతతో పశువుల సంరక్షణ, పాల దిగుబడిపై ఎండ తీవ్రత, వడదెబ్బ ప్రభావం పడుతుందని పశువైద్యులు చెబుతున్నారు. మండుతున్న వేసవిలో పశుపోషణ విషయంలో పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుత వాతావరణంలో పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ తగిలిన పశువుల పాల ఉత్పత్తి తగ్గడమే కాక ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, చూలు కట్టే అవకాశం ఉండదని చెబుతున్నారు. వేసవి పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకే వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గేదెలు, ఆవులపై సరైన శ్రద్ధ తీసుకోకుంటే వడదెబ్బకు గురై, ఒక్కోసారి పశువు చనిపోయే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు.

ఆవులు, గేదెలు వివరాలు...

మండలం	ఆవులు	గేదెలు
అనపర్తి	1,256	8,644
పెదపూడి	2,160	10,445
బిక్కవోలు	1,203	5,798
రంగంపేట	7,623	1,1045
రాజానగరం	10,244	21,327
సీతానగరం	5,194	10,334
కోరుకొండ	5,280	13,074

పాటించాల్సిన జాగ్రత్తలివే..

వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి, నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారుతుంది. కలుషితమైన ఈ నీరు తాగితే వ్యాధి కారక క్రిములు శరీరంలోకి చేరి పశువులు పారుడు వ్యాధి బారిన పడతాయి. నీడలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే పశువులకు రోజుకు కనీసం నాలుగుసార్లు తాగించాలి. ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయసు ఆధారంగా రోజుకు సుమారు 35 లీటర్ల నీరు అవసరమవుతుంది. ఆవులతో పోలిస్తే గేదెలు నీటిని ఎక్కువగా తాగుతాయి. పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి. నడిచేటప్పుడు పశువులు తూలుతాయి. శ్వాస ప్రక్రియ ఎక్కువ అవుతుంది. పశువు చాలా నీరసంగా కనబడుతుంది. వడదెబ్బకు గురైన పశువుల శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. ఒక్కోసారి కింద పడి కొట్టుకుని స్పృహ కోల్పోతాయి. పశువు నీటి కోసం చూస్తుంటుంది. చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాల ఉత్పత్తి పడిపోతుంది. ఇటువంటి లక్షణాలుంటే వడదెబ్బ తగిలిందని గ్రహించి, దగ్గరలోని పశువైద్యులను సంప్రదించాలి. వడదెబ్బ తగిలినట్లు గుర్తించిన వెంటనే చల్లని నీటితో పశువు ముఖాన్ని కడగాలి. వస్త్రంలో ఐస్ పెట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి.

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో ...

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో పలు పశువైద్యశాలలు ఉన్నాయి.

వడదెబ్బ తగలకుండా చూడాలి



పెరుగుతున్న ఎండలు నేపథ్యంలో పశువులకు అందుబాటులో మంచినీరు ఉండేవిధంగా చర్యలు చేపట్టాలి. పశువుల పాక రేకులతో వేస్తే దానిపై పైకప్పును కొబ్బరి, తాటి ఆకులు, వరి గడ్డితో కప్పాలి. ఉదయం సాయంత్రం చల్లటి వాతావరణంలో పశువులను మేతకు వదలాలి. పశువుల ఉండే పాక చుట్టూ పాత గోనె సంచులు, పంచెలు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడూ తడుపుతూ ఉండాలి. వాటికి వడదెబ్బ తగలకుండా చూసుకోవాలి.

– చింతా కిరణ్మయి, పశువైద్యాధికారి, పెదపూడి మండలం

కష్టపడి పనిచేసేవారికి పార్టీలో గుర్తింపు



పదవులకు ఎంపికైన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సూర్య నారాయణరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కష్టపడి పనిచేసిన ప్రతీ ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు, ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శితోపాటు పార్టీ వివిధ విభాగాల్లో వివిధ పదవులకు నూతనంగా ఎంపికైన నియోజకవర్గంలోని పెదపూడి మండలానికి చెందిన పలువురు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి మండా రాజారెడ్డి, పంచాయతీరాజ్ నియోజకవర్గ అధ్యక్షుడు సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, వాణిజ్య విభాగం కార్యదర్శి కడిమి శ్రీను, ట్రేడ్‌యూనియన్ ఉపాధ్యక్షుడు మల్లిడి నితిన్‌రెడ్డిలను ఎమ్మెల్యే సత్కరించారు.

విద్యార్థుల నమోదు పెంచేందుకు కృషి



సుభద్రంపేటలో విద్యార్థుల చేరిక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రంగంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయబోతున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్ (ఐఎఫ్‌పీ) ద్వారా ప్రభుత్వ పాఠశాలల చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభం కావడంతో పాటు అధునాతన బోధనా పద్ధతుల్లో ఆకర్షణీయ విద్యాబోధన జరగనుంది. దీనిలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి విద్యార్థుల చేరిక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో ఎందుకు చేర్చాలో సోదాహరణంగా వివరిస్తున్నారు. జగనన్న విద్యాకానుక ద్వారా కల్పిస్తున్న వివిధ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, పైసా ఖర్చు లేకుండా అత్యుత్తమ విద్యను అందుకోవడం ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమని పేరెంట్స్‌కు వివరిస్తున్నారు. బోధనలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలు నిలయాలని సూచిస్తున్నారు. దూర ప్రాంతాలకు తమ బిడ్డలను పంపాల్సిన అవసరం లేదని, వేలల్లో రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదని, ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేగంగా నాడు-నేడు పనులు

దీఈఓ అబ్రహం



జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ అబ్రహం

అనపర్తి: నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల పరిధిలో జరుగుతున్న నాడు–నేడు ఫేజ్–2 పనులపై ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో డీఈఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు–నేడు రెండో దశ పనులను పాఠశాల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలన్నారు. నాడు–నేడు పనులు జరుగుతున్న పాఠశాలల ఖాతాలకు నిధులు జమ అయ్యాయని తెలిపారు. నిధులు కొరత లేని కారణంగా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఐదు సంవత్సరాలు నిండిన బడిఈడు చిన్నారులందరూ బడిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, దీనిలో భాగంగా హౌస్ విజిట్ చేయాలని ఆదేశించారు. రక్తహీనత గల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సంబంధిత పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి విద్యార్థుల క్షేమ సమాచారాన్ని సేకరించాలన్నారు. పదోతరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులను త్వరలోనే సత్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను సందర్శించిన డీఈఓ పుస్తకాలను పరిశీలించారు. అనపర్తి, రంగంపేట ఎంఈఓలు ఎంఈఓ కె.స్వామినాయక్, శ్రీనివాస్, అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నల్లమిల్లి సత్తిరెడ్డి, జేఈలు, ఏపీఎంలు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పందనలో ఫిర్యాదుకు సత్వర పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్ కోసం స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామంలోని కృష్ణుడి గుడి ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ లేక, విద్యుత్ సరఫరా సక్రమంగా జరగక స్థానికులు ఇబ్బందులు పడేవారు. ఆ సమస్యపై ఇటీవల స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. ఆ ప్రాంతంలో శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఆ శాఖ డీఈ చిట్టిరాజు మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిందన్నారు. స్థానికుల కోరిక మేరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కడవల శివ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

సీతానగరం: పశువులకు దొమ్మ వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నామని వెదుళ్లపల్లి పశువుల ఆసుపత్రి డాక్టర్ భానుతేజ శుక్రవారం తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో పశువులు తినే పచ్చగడ్డిలో ఉండే క్రిముల కారణంగా దొమ్మవ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. గొంతువాపు, మేత తినకపోవడం, గురక, సొంగ కార్చడం, తీవ్రమైన జ్వరం, కళ్లు ఎరుపుగా మారడం ఆ వ్యాధి లక్షణాలన్నారు. దీని నివారణకు పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పర్యావరణ రక్షణ సమష్టి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి కూలీలు

రాజానగరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వంటి వాటిని వాడకుండా నిషేధించాలని అటవీ శాఖ బీట్ అధికారి జీవీ రంగారావు అన్నారు. వెలుగుబందలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలను పర్యావరణ పరిరక్షణపై చైతన్యపరుస్తూ మిషన్ లైఫ్ ఎన్విరాన్‌మెంట్ అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలన్నారు. ఇందుకు అనుగుణంగా మన జీవనశైలిని కూడా మార్చుకోవాలని సూచించారు. నీటి సంరక్షణ, ఇంధన పొదుపు, ప్లాస్టిక్ సంచులు, కవర్ల నిషేధం వంటి వాటిని బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. గ్రామంలోని సాపిరెడ్డి చెరువు చుట్టూ ఉన్న వ్యర్థాలను తొలగించి, పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణ మా బాధ్యతం టూ అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అసిస్టెంట్ బీట్ అధికారి శివప్రసాద్ రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ క్షేత్ర సహాయకుడు సుబ్బారావు పాల్గొన్నారు.

మొక్కజొన్న తుక్కులో మంటలు



మొక్కజొన్న తుక్కులో చెలరేగిన మంటలు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల పంటపొలాల్లో మొక్కజొన్న తుక్కుకు మంటలు చెలరేగాయి. అవి వరి కుప్పలకు పాకే అవకాశం ఉండటంతో రైతులు వెంటనే అప్రమత్తమయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ముగ్గళ్ల పంటపొలాల్లో మొక్కజొన్న తుక్కుకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. వాటిని అదుపు చేయలేని పరిస్థితి ఏర్పడింది. వెంటనే రైతులు చాపర్ల రాంబాబు, నడకుర్తి వెంకటేశ్వరరావు తమ ట్రాక్టర్లును తీసుకువెళ్లి మంటలు వరికుప్పల వైపు వ్యాపించకుండా పొలాన్ని దున్నారు. నడకుర్తి వెంకటేశ్వరరావు ఈ విషయాన్ని రాజమహేంద్రవరం అగ్నిమాపక కేంద్రకు సమాచారం అందించారు. కొవ్వూరు అగ్నిమాపక కేంద్రం నుంచి అగ్నిమాపక శకటం ముగ్గళ్ల చేరుకుంది. ఆ శకటం వచ్చేవరకు సుమారు 30 మంది రైతులు పొలాలకు తరలివెళ్లి మంటలు వరికుప్పల వద్దకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపుచేసింది.

మూగజీవాల సంరక్షణకు కృషి

రాజమహేంద్రవరం సిటీ: మూగజీవాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ సత్య గోవింద్ పిలుపు నిచ్చారు. లలితా నగర్‌లో శుక్రవారం పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, నామన వాసు ఆధ్వర్యంలో నామన ధనరాజు జ్ఞాపకార్థం మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు కుండీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సత్యగోవింద్ మాట్లాడుతూ ఎక్కడైనా మూగజీవాలు ప్రమాదంలో ఉన్నా, అస్వస్థతకు గురైనా 1962 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని వాటిని సంరక్షిస్తామన్నారు. పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పంతం కొండలరావు మాట్లాడుతూ నామన వాసు సేవలను కొనియాడారు. ఐదేళ్లుగా మూగజీవాల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టుతో కలిసి మంచినీటి కుండీలను అందించే బృహత్తర కార్యక్రమం చేస్తున్నారన్నారు. ఈ ఐదేళ్లలో సుమారు 650 కుండీలను అందజేశామని, ఈ ఏడాది మరో వందకుండీలను పంపిణీ చేస్తున్నామన్నారు. జంతు ప్రేమికులు విశ్వనాథ్ గోపికాంత్ మాట్లాడుతూ మూగజీవాలను హింసించడం, హతమార్చడం అతి పెద్ద నేరమన్నారు. వాటిని ప్రేమించి మానవత్వం చాటుకోవాలని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనూప్ జైన్, పింటూ జైన్, రాజ్ కొటారియా, అమీర్ పాషా పాల్గొన్నారు.

పకడ్బందీగా విద్యాకానుక పంపిణీ



జేవీకే కిట్ స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్జేడీ నాగమణి

కంబాలచెరువు: జగనన్న విద్యా కానుక పంపిణీని అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని జోన్ – 2 ప్రాంతీయ విద్యా సంచాలకులు జి.నాగమణి అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టోరేజ్ పాయింట్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్ అత్యంత కీలకమని, స్టాక్ వచ్చిన వెంటనే నమోదు చేయడం, సంబంధిత చలాన్‌ను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండల స్థాయిలో నాణ్యతా పరిశీలనకు కమిటీని ఏర్పాటు చేశామని అర్బన్ రేంజ్ డీఐ బి దిలీప్ కుమార్.. ఆర్జేడీకి వివరించారు. అనంతరం స్టాక్ వివరాలను పరిశీలించారు. ఆమె వెంట రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్, సమగ్ర శిక్షా సీఎంవో శ్రీనివాసరావు, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాపై అవగాహన అవసరం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డెంగీ, మలేరియా జ్వరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి జి.వీర్రాజు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన స్థానిక 16వ డివిజన్ వాంబే కాలనీలో ఇంటింటా సర్వే జరిపారు. ఈ సందర్భంగా ఇళ్లలోని నీటిట్యాంకులు, పూలకుండీలు, ఫ్రిజ్‌ట్రేలలో ఉన్న లార్వాలను గుర్తించి యాంటీలార్వాల్ ఆపరేషన్ చేశారు. పరిసరాల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం ఇంటిలోని నీటి నిల్వలను తొలగించాలని, ప్రతి ఒక్కరూ దోమతెరలను ఉపయోగించాలన్నారు. జ్వరం అనిపించిన వెంటనే దగ్గరలోని యూపీహెచ్‌సీలకు వెళ్లి రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు.

ఆర్‌టీఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలిగా సత్యభామ

ప్రకాశం నగర్: ఆర్‌టీఐ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షురాలిగా డాక్టర్ రాయవరపు సత్యభామ నియమితులయ్యారు. ఈ విషయాన్ని శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గార్డ్స్ ఫర్ ఆర్‌టీఐ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పటిష్ఠత కోసం పాటుపడతామన్నారు. సమావేశంలో సంఘం జాతీయ మహిళా కన్వీనర్ ఆకుల విజయభారతి, రాష్ట్ర కన్వీనర్ బి.సంజీవరావు, హ్యూమన్ రైట్స్ యాక్టివిస్టు అమీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ చేరవేయడం ద్వారా విశిష్ట సేవలు అందిస్తున్న వలంటీర్ల సన్మాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎల్ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. అనపర్తి గ్రామ పంచాయతీ పరిధిలో అత్యుత్తమ సేవలందించిన ఇద్దరు సేవా రత్న, 149 మంది సేవా మిత్ర పురస్కారాలను ఎంపికైనట్లు తెలిపారు. వలంటీర్లకు వందనం పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమం స్థానిక తేతలి తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

ఆరోగ్యశ్రీ సేవలపై వదంతులు నమ్మవద్దు

అనపర్తి: ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోతున్నట్లు వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. నవరత్న పథకాల్లో భాగంగా ప్రతీ పేద వాడికి మరింత నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం సేవలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపారు. ఏపీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్(ఆశ) ప్రతినిధులతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ, సంబంధిత అధికారులు జరిపిన సంప్రదింపుల్లో సానుకూల నిర్ణయం వెలువడిందని తెలిపారు. దీంతో అసోసియేషన్ వారు ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు అంతరాయం కలుగకుండా కొనసాగించేందుకు హామీ ఇచ్చారని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల చేస్తున్నట్లు వచ్చిన వదంతులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు సూచించాయి.

28న సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయ 21వ వార్షికోత్సవం ఈనెల 28న నిర్వహించనున్నారు. వేకువజామున 5.15 గంటలకు ఇచ్చే కాకడ హారతితో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం బాబా మూలవిరాట్‌కి అభిషేకాలు చేస్తారు. తదుపరి అఖండ బిల్వార్చన ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం హారతి అనంతరం అన్నసమారాధన, సంధ్యాహారతి తరువాత భజన, సంకీర్తనలు ఉంటాయి.

వలంటీర్లకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాలు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో ఈ నెల 22 నుంచి గ్రామ వలంటీర్లకు అవార్డుల ప్రదానోత్సవం, సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. ఆయన శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 22న జి.మామిడాడలోని నాలుగు సచివాలయాలు, పైన, రాజుపాలెం గ్రామాల్లో, 23న పెదపూడి, పెద్దాడ, కై కవోలులో, 24న దోమాడ, కరకుదురు, రామేశ్వరం, ఏపీత్రయంలో, 25న కాండ్రేగుల, శహపురం, వేండ్రలో, 26న పుట్టకొండ, సంపర, గండ్రేడులో సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

మద్దాల చంటిబాబుకు అభినందనలు

మధురపూడి: గోపాలమిత్ర సంఘానికి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మద్దాల చంటిబాబుకు శుక్రవారం దళిత సంఘాల నాయకులు శుక్రవారం అభినందనలు తెలిపారు. ఆయనను పూలమాలలతో సత్కరించారు. కోరుకొండ మండలం బుచ్చంపేట చెందిన చంటిబాబు ఇటీవల సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చెరువుల అక్రమ తవ్వకాలు నిలుపుదల

పెదపూడి: పెద్దాడలో అనుమతులు లేకుండా తవ్వుతున్న చేపల చెరువుల పనులు నిలుపుదల చేసినట్లు తహసీల్దార్ టి.సుభాష్, ఎస్సై పి.వాసు తెలిపారు. గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు ఆ చెరువుల అక్రమ తవ్వకాలను శుక్రవారం గుర్తించారు. రెండ్రోజులుగా సుమారు పది ఎకరాల్లో అక్రమ చెరువులు తవ్వుతున్నారని, జేసీబీ, ఇతర వాహనాలు సీజ్ చేసి, నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రేపటి నుంచి తాడేపల్లి అమ్మవారి తీర్థమహోత్సవాలు

రాజానగరం: మండలంలోని పాలచర్ల నుంచి వెలుగుబందకు వెళ్లే మార్గంలో కొలువైన గ్రామ దేవత తాడేపల్లి అమ్మవారి తీర్థమహోత్సవాలు ఆదివారం నుంచి ఈనెల 25 వరకు జరగనున్నాయి. ఆదివారం రాత్రి గ్రామంలో జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆర్కెస్ట్రా, బేబీ డ్యాన్స్, తీన్‌మార్, గరగ నృత్యాలు ఏర్పాటు చేశారు. 22న తీర్థం, 25వ తేదీన అన్నసమారాధన నిర్వహిస్తారు.

వ్యక్తికి గాయాలు

సీతానగరం: బొబ్బిల్లంక – మిర్తిపాడు రోడ్డు టర్నింగ్‌లో ఆగి ఉన్న ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మోటారు సైకిల్‌పై వేళుతూ వేగంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతడి దవడ ఎముక వద్ద తీవ్ర గాయమైంది. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు ఆటోలో రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.